క్లుప్తంగా

అమ్మవారికి వెండిదీపాల సమర్పణ



వెండి వస్తువులను అందజేస్తున్న జ్యోతమ్మ, చరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు

చౌడేపల్లె: శ్రీ బోయకొండ గంగమ్మకు మండలంలోని కాటిపేరి ఎంపీటీసీ లద్దిగం గ్రామానికి చెందిన జ్యోతమ్మ, కృష్ణారెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డి, మౌనిక దంపతులు రూ.4 లక్షల విలువచేసే వెండి వస్తువులు ఆదివారం సమర్పించారు. తొలుత అమ్మవారికి ప్రత్యేక పూజలుచేసి మొక్కులు చెల్లించారు. అనంతరం వెండి తట్ట, నూనెదీపాలను ఆలయ ఈఓ చంద్రమౌళి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, చైర్మన్ నాగరాజారెడ్డికి అందజేశారు. తమ కోర్కెలు నెరవేరడంతో వీటిని అమ్మవారికి సమర్పిస్తున్నట్లు చెప్పారు. దాతలను ఆలయ అధికారులు సన్మానించి తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో పుంగనూరు ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, నేతలు మల్లికార్జునరెడ్డి, సురేంద్రరెడ్డి, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఆలయంలో వైభవంగా దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. పూజల్లో ఆలయ చైర్మన్‌తోపాటు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయంలో నిత్యాన్నదానం పథకానికి విజయనగరం జిల్లాకు చెందిన జి.దామోదరరావు రూ.లక్ష విరాళమిచ్చారు. ఆదివారం కుటుంబ సమేతంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం విరాళాన్ని ఆలయ కార్య నిర్వహణాధికారి చంద్రమౌళికు అందజేశారు. ఆలయ అధికారులు ఆయనను అమ్మవారి శేష వస్త్రంతో సత్కరించారు.

జోగివారిపల్లెలో 'ప్రపంచ గ్రామీణ మహిళా దినోత్సవం'



ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సదుం: గ్రామీణ ప్రాంత మహిళలకు ప్రభుత్వాలు ఉపాధి మెరుగుపరచాలని ఏపీ వ్యవసాయ వృత్తిదారుల యూనియన్ మండల కార్యదర్శి చంద్రమ్మ కోరారు. మండలంలోని జోగివారిపల్లెలో ప్రపంచ గ్రామీణ మహిళా దినోత్సవం ఆదివారం నిర్వహించారు. మహిళల చట్టాలపై అవగాహన కల్పించి, అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో యశోదమ్మ, రాణెమ్మ, సుమలత పాల్గొన్నారు.

20వరకు న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: స్టాంపుల ధర పెంపునకు నిరసనగా న్యాయవాదుల విధుల బహిష్కరణ కార్యక్రమం ఈనెల 20 కొనసాగిస్తున్నట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గల్లాశివశంకర్‌నాయుడు తెలిపారు. ఈనెల 5 నుంచి విధులు బహిష్కరించడం విదితమే.

ఈరోజు

మంత్రి, ఎంపీ పర్యటనపై సమావేశం

పులిచెర్ల(కల్లూరు): రాష్ట్ర అటవీ, విద్యుత్, పర్యావరణ, గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి ఈ నెల 18న మండల పర్యటనకు విచ్చేస్తున్నారని, దీనికి సంబంధించి సోమవారం ఉదయం 10గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, కార్యకర్తలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి తెలిపారు. పులిచెర్లలో కొత్తగా నిర్మించిన మండల పరిషత్ కాంప్లెక్స్ భవనాలను, జ్యోతీరావు పూలే బాలికల గురుకుల పాఠశాల తాత్కాలిక భవనాలను ఆరోజున మంత్రి, ఎంపీ ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండలంలో ఈనెల 18న పర్యటించనున్న నేపథ్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసినట్టు మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్‌రెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు హాజరు కావాలని కోరారు.

వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

కుప్పం: నియోజవర్గ వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం పీఈఎస్ మెడికల్ కళాశాల ఎదురుగా ఉన్న ప్రదేశంలో సోమవారం ఉదయం 10గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్సీ, జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షులు భరత్ హాజరవుతారని, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, రాష్ట్ర స్థాయి డైరెక్టర్లు, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరాయి.

చౌడేపల్లెలో ఆరోగ్య సురక్ష

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు సర్పంచ్ వరుణ్ భరత్ తెలిపారు. ప్రజలకు ఏడు రకాల వ్యాధి నిర్ధారణకు పరీక్షలను ఉచితంగా నిర్వహించి మందులను పంపిణీ చేస్తామని, దీనిని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నడివీధి గంగమ్మ ఆలయం ప్రారంభం

పుంగనూరు: మండలంలోని మేలుందొడ్డిలో తిరుమల-తిరుపతి దేవస్థానం ఆర్థిక సహాయంతో సమరసత ఫౌండేషన్ నిర్మించిన నడి వీధి గంగమ్మ ఆలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్టు నిర్వాహకులు మునిరామిరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నాగరాజారెడ్డి తెలిపారు. దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

పెద్దపంజాణి: అలంకరణలో దుర్గమ్మ



వి.కోట : లక్ష్మీదేవిగా దుర్గామాత



వి.కోట : మహాలక్ష్మిగా వాసవీ మాత



పుంగనూరు : అలంకరణలో పార్వతిదేవి



పుంగనూరు: ప్రత్యేక అలంకరణలో విరూపాక్షి మారెమ్మ



సదుంలో చౌడేశ్వరీదేవి



శాంతిపురం : పసుపు అలంకరణలో అమ్మవారు



రామకుప్పం: పసుపు అలంకారంలో వాసవీమాత



భక్తిప్రపత్తులతో నవరాత్రి ఉత్సవాలు



బైరెడ్డిపల్లె: తీర్థంలో ఊరేగుతున్న శ్రీరామచంద్రస్వామి



పుంగనూరు : అష్టలక్ష్మికి ప్రత్యేక పూజలు

బైరెడ్డిపల్లె: మండలంలోని పలు ఆలయాల్లో ఆదివారం వైభవంగా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఎస్సీ కాలనీలోని సల్లాపురెమ్మ ఆలయం, బాట గంగమ్మ ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. తీర్థంలోని శ్రీరామచంద్రస్వామి ఆలయంలో ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

శ్రీ బాలత్రిపుర సుందరిగా దుర్గమ్మ

పెద్దపంజాణి: శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని శంకర్రాయలపేట దొరచెరువు కట్టపై ఉన్న దుర్గమ్మ ఆదివారం శ్రీ బాలత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. రేణుక, దామా ధనంజయ నాయుడు, నందిగం రెడ్డెప్ప నాయుడు, ప్రియాంక తదితరులు ఉభయదారులుగా వ్యవహరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వి.కోటలో..

వి.కోట: దుర్గానగర్‌లోని దుర్గామాత ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం దుర్గామాత మహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శమిచ్చారు. సాయంత్రం ఉత్సవమూర్తులను లక్ష్మీదేవిగా అలంకరించి ఉయ్యాల సేవ నిర్వహించారు. వందలాది మంది మహిళా భక్తులు హాజరై లలితా సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్, సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. అలాగే, పట్టణంలో కేపీపీదిలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

పుంగనూరులో..

పుంగనూరు: నవరాత్రి ఉత్సవాలు ఆదివారం పలు ఆలయాల్లో వైభవంగా మొదలయ్యాయి. స్థానిక శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు ఆధ్వర్యంలో శ్రీ అష్టలక్ష్మి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అలాగే శ్రీభోగనంజుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతిదేవిని కుంకుమ, పసుపుతో, శ్రీవిరూపాక్షి మారెమ్మ, శ్రీచాముండేశ్వరి, శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి ఆలయాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు, హోమాలు అభిషేకాలు చేసి, భక్తులకు ప్రత్యేకంగా అలంకరించారు. తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. విద్యుత్ దీపాలతో ఆలయాలు నూతన శోభను సంతరించుకున్నాయి.

సదుంలో..

సదుం: స్థానిక కన్యకా పరమేశ్వరి, జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయాల్లో దసరా ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపుర సుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి రిటైర్డ్ టీచర్ సురేంద్ర, గీత దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు.

నక్కపల్లె గంగమ్మ ఆలయంలో..

పలమనేరు: నక్కపల్లెలోని బోయకొండ గంగమ్మ ఆలయంలో ఈనెల 23 వరకు దసరా ఉత్సవాలు నిర్వహించనున్నట్టు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. సోమవారం అమ్మవారు అన్నపూర్ణదేవీగా, మంగళవారం మహాలక్ష్మిగా, బుధవారం మహాచండిగా, గురువారం సరస్వతిదేవీగా, శుక్రవారం లలితాదేవిగా, శనివారం దుర్గమ్మగా, ఆదివారం మహిషాసురమర్దినిగా భక్తులకు దర్శనమిస్తారని నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి మేలుమాయి క్రాస్‌లో..

గంగవరం: మండలంలోని మేలుమాయి క్రాస్ వద్ద ఉన్న శ్రీమలాలమ్మ (చాముండేశ్వరీదేవి) ఆలయంలో దసరా నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. రోజుకో అవతారం ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, ధాన్యలక్ష్మి, గజలక్ష్మి, సంతానలక్ష్మి, ధైర్యలక్ష్మి, దుర్గాదేవి, గాయత్రిదేవి, ఆఖరి రోజున మహిషాసురమర్దిని అవతారాల్లో అమ్మవారు భక్తులను అనుగ్రహిస్తారని, అలాగే ఆఖరి రోజున పార్వేట ఉత్సవం, శయనోత్సవంతో పరిసమాప్తమవుతాయని తెలియజేశారు.

కుప్పం నియోజకవర్గం

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



కుప్పం: కాళీమాత ప్రతిమ

కుప్పం: పట్టణంలోని దేవాలయాల్లో ఆదివారం దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్యాలెస్ ఎక్స్‌టెక్షన్ హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కాళీమాత ప్రతిమను ప్రతిష్ఠాపన చేసి దేవీ నవరాత్రుల వేడుకలు నిర్వహించారు. అమ్మవారి ప్రతిమలకు తొమ్మిది రోజులు విశేష పూజల అనంతరం పట్టణ వీధుల్లో ఊరేగించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. పట్టణంలో తొలిసారి కాళీమాత ప్రతిమ ప్రతిష్ఠాపనతో చేయడంతో పెద్దసంఖ్యలో భక్తులు పూజలకు హాజరయ్యారు. అలాగే శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ, శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయం, శ్రీ ప్రసన్న పెద్దపల్లి గంగమ్మ దేవాలయాల్లో తొలిరోజు నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.

బాలాత్రిపుర సుందరిగా ఎల్లమాంబ

శాంతిపురం: సోగడబల్ల సమీపంలోని శ్రీ ప్రసన్న గురుమూర్తి ఎల్లమాంబ ఆలయంలో అమ్మవారు ఆదివారం బాలా త్రిపుర సుందరి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా తొలి రోజు అమ్మవారిని పసుపుతో అలంకరించారు. కాశీవిశ్వనాథశాస్త్రి ఆధ్వర్యంలో అభిషేకం, ప్రత్యేక అలంకరణల అనంతరం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మకర్తలు నాగమ్మ, చంగప్ప భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

పసుపు అలంకారంలో వాసవీమాత

రామకుప్పం: దసరా శరన్నవరాత్రుల్లో భాగంగా రామకుప్పం, ఆనిగానూరులోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం వాసవీమాత పసుపు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేసారు.

ముత్యాలమ్మ సేవలో జెడ్పీ చైర్మన్



ప్రత్యేక పూజల్లో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు

పెద్దపంజాణి: మండలంలో రాయలపేటలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం జిల్లా పరిషత్ ప్రత్యేక ఆహ్వానితులు డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, అమర్నాథ్‌తో కలిసి ఆయన ఆలయానికి వచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఆంజమ్మ, కౌన్సిలర్లు మండీ సుధా, రాజేష్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

సోమల: సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ వెంకట నరసింహులు ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండలంలోని వల్లిగట్ల పంచాయతీ గల్లావారిపల్లె వద్ద సారా విక్రయిస్తున్నట్టు సమాచారం అందడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో దాడులు చేశారు. ప్రభాకర్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు మునిప్రసాద్, దేవరాజులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ నితిన్, ఎంపీపీ సుబ్రమణ్యం

రామకుప్పం: రామకుప్పంకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మురుగేష్ రెండు రోజుల క్రితం వీ.కోట సమీపంలో రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. కుప్పం పీఈఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ స్థానిక వైఎస్సార్ సీపీ నేతల ద్వారా రూ.10వేలను మృతుడి కుటుంబానికి జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం అందజేశారు. మురుగేష్ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వార్డు సభ్యుడు ప్రసాద్, పార్టీ నేతలు వెంకటాచలపతి, నటరాజ్, యశ్వంత్ రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా అబ్దుల్ కలాం జయంతి



అబ్దుల్ కలాం చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

పులిచెర్ల(కల్లూరు): మాజీ రాష్ట్ర పతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం కల్లూరులో లయన్స్ క్లబ్ ఘనంగా నిర్వహించింది. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించింది. అనంతరం జిల్లా లయన్స్ క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ స్థానిక పంచాయతీ గ్రంథాలయానికి పలు పుస్తకాలను విరాళంగా అందజేశారు. లయన్స్ క్లబ్ సభ్యులు రాజారెడ్డి, ఆర్ఎస్ రాజన్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..



రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: మాజీ రాష్ట్రపతి, భారత రత్న ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను రొంపిచెర్లలో ఆర్టీఐ యూనియన్ కార్యకర్తలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఆర్టీఐ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ మాట్లాడారు. కలాం దేశానికి చేసిన సేవలను ప్రస్తుతించారు. అబ్దుల్ కలాం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో చేసిన కృషి ఫలితంగా ప్రపంచ దేశాలు మన దేశం వైపు చూసేలా చరిత్ర సృష్టించారని స్మరించారు. కార్యక్రమంలో ఆర్టీఐ జిల్లా కో-కన్వీనర్ వెంకటేష్, బర్డ్ సంస్థ ప్రతినిధి సుధాకర్ రెడ్డి, మండల బీసీ సంఘం అధ్యక్షుడు నూరేషా, రాజన్న, ఆశోక్‌కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● అ'పూర్వ' కలయిక



బీఎన్ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు

చిత్తూరు రూరల్: ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడే కలిశాము.. చదువులమ్మ చెట్టు నీడలో అంటూ బాల్యంలో ఒకే పాఠశాలలో చదివి 33 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనంలో ఒక్కటయ్యారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చిత్తూరు మండలం బీఎన్ఆర్‌పేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1989-90 విద్యార్థులు కలుసుకున్నారు. తాము చదివిన పాఠశాలను మళ్లీ చూసుకుని ఆనందబాష్పాలు రాల్చారు. మిత్రులను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల పాఠశాలలో జరిగిన మధురానుభూతులను పంచుకుని ఆనందడోలికల్లో మునిగితేలారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. విద్యార్థి దశ చాలా విలువైందని నేటి కలయికకు హాజరైన ఎంతో మంది పూర్వ విద్యార్థులు వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరడం అభినందనీయమన్నారు. పూర్వవిద్యార్థిగా ఈ వేడుకలో జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు హాజరయ్యారు. ఆయనకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులకు పాదాభివందనం చేసి, సన్మానించారు. ఆశీస్సులు పొందారు. జ్ఞాపికలను అందజేశారు.

సాయిబాబా మహా సమాధి పూజలు

చిత్తూరు రూరల్: కట్టమంచిలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో ఆదివారం బాబా మహా సమాధి పూజలను ఘనంగా నిర్వహించారు. మూల విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే సీకే బాబు దంపతులు పాలాభిషేకం చేసి పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



కంటి ఆపరేషన్లకు ఎంపికైన వారు

కుప్పం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయిమాత సేవా ట్రస్ట్ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి మంచి స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన శంకరా కంటి ఆస్పత్రి వైద్య నిపుణులు 220 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 62 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం ఎంపిక చేశామని, బెంగళూరులో ఆపరేషన్ల అనంతరం లెన్స్ అమర్చి, మందులు ఇవ్వనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్యులు శివరాజ్, ప్రమీల, సాయిమాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకుడు జగదీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం : నిందితుడి అరెస్ట్



మద్యం అక్రమ రవాణా చేస్తున్న నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ మాధవస్వామి, సిబ్బంది

పుంగనూరు: పెద్దపంజాణి మండలం గల్లావారిపల్లెలో కర్ణాటక మద్యం విక్రేతను అరెస్ట్ చేసి అతడి నుంచి 960 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మాధవస్వామి ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. అందిన రహస్య సమాచారం మేరకు గల్లావారిపల్లెలో దాడులు చేశారు. జగపతి అనే వ్యక్తిని అరెస్ట్ చేశారు. ఇతడు కర్ణాటకలోని రాక్‌వెల్లి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద నుంచి మద్యం ప్యాకెట్లు తెచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్టు ప్రాథమిక విచారణలో తేలింది. అతడిపై కేసు నమోదు చేసి తరలించారు. దాడుల్లో ఎస్‌ఐ మస్తాన్‌వల్లి, హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనాథరెడ్డి, నాగరాజ, నాగరాజు, గౌతమ్‌కుమార్ పాల్గొన్నారు.

వేడుకగా గణనాథుని కల్యాణోత్సవం



గణపతి హోమం చేస్తున్న వేదపండితులు



విశేష అలంకరణలో ఏకదంతుడు

గుడిపాల: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మండలంలోని వసంతాపురం టీటీడీ కల్యాణ మండపంలో గణపతి హోమం, స్వామివారి కల్యాణోత్సవాన్ని ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. సర్పంచ్ రజినీకాంత్ దంపతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాదే కీలకపాత్ర

పుత్తూరు రూరల్: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కీలకపాత్ర పోషించాలని వైఎస్సార్‌సీపీ నేత వై.రామ్‌ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా వర్క్ షాపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రతినిధులు చురుగ్గా పని చేయడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం ఎన్నికల సమయమని, రాష్ట్రంలో సీఎం జగనన్న, నగరి నియోజకవర్గంలో మంత్రి ఆర్కే రోజా చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఏ.హరి, వైస్ చైర్మన్లు డి.శంకర్, డి.జయప్రకాష్, సోషల్ మీడియా ప్రతినిధులు జయకృష్ణ, శివ, చంద్రారెడ్డి, గాంధీ, వెంకటేష్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, ప్రసాదు, రాజ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.